నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | HYDERABAD

ఇదేం చోద్యం..!

అసలే బస్ షెల్టర్లు లేక నగరవాసులు ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తూ.. ఇబ్బందులు పడుతుంటే.. బోరబండలో భిన్న పరిస్థితి. ఇక్కడ ఏసీ బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నాయి. ఇటీవల షెల్టర్ తాళాలు తీసి.. అధికారులు హడావుడి చేశారు. అయితే మళ్లీ షెల్టర్‌కు తాళం వేశారు. శనివారం ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు.. తాళం ఉన్న బస్ షెల్టర్ వద్ద నిల్చొని తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పక్కనే ఆలయం మెట్లపై మరికొందరు కూర్చోవాల్సి వచ్చింది. అసలే బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు ఎదురవుతుంటే.. ఉన్న షెల్టర్‌కు తాళం వేసి ఉంచడం ఏమిటని ప్రయాణికులు మండిపడుతున్నారు. –ఎర్రగడ్డ, ఆగస్టు 31

వద్దన్నా.. పెయిడ్ పార్కింగ్‌గా?

ఎక్స్ వేదికగా ప్రభుత్వ చర్యలపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : మెట్రో ప్రయాణాన్ని మరింత ప్రోత్సహించే విధంగా ఉండాల్సిన ప్రభుత్వ చర్యలు మెట్రో ప్రయాణికులను ఇబ్బంది పెట్టేలా ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో పెయిడ్ పార్కింగ్ ప్రతిపాదనను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో అలాంటి ఆలోచన ఏమీ లేదని చెప్పారని శనివారం ఎక్స్ వేదికగా కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అకస్మాత్తుగా సెప్టెంబర్ 15 నుంచి పెయిడ్ పార్కింగ్ అమల్లోకి వస్తుందని బోర్డులు దర్శనమిస్తున్నాయన్నారు. ఈ చర్యలు చూస్తుంటే మెట్రోను మరింత ప్రోత్సహించే లాస్ట్ మైల్ కనెక్టివిటీ అనే సంగతి ఇక ప్రభుత్వం పట్టించుకోదని స్పష్టంగా అర్థమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గోషామహల్ ఆర్యసమాజ్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

స్టేడియం స్థలం ఉస్మానియాకు ఇవ్వొద్దు

గోషామహల్‌లో కొనసాగుతున్న స్థానికుల నిరసన

అబిడ్స్, ఆగస్టు 31: 'గోషామహల్ పోలీస్‌స్టేడియం ప్రాంతంలో ఉస్మానియా దవాఖాన నిర్మిస్తే.. స్థానికులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది.. అంతేకాకుండా మార్చురీ ఏర్పాటు..వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతంలో మరింత ట్రాఫిక్ సమస్య తలెత్తుంది'. అంటూ.. స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు గోషామహల్ ప్రాంతంలో చేపట్టిన ఆందోళన శనివారం రెండో రోజుకు చేరుకున్నది. మొదటి రోజు హజారి భవన్ వద్ద, రెండో ఆర్యసమాజ్ వద్ద దవాఖాన నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ.. స్థానికులు సంతకాల సేకరణ చేపట్టారు. గోషామహల్ ప్రజా పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి.. ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆసుపత్రి ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకు ఆందోళన చేస్తామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నిరసనలో వినోద్, శైలేశ్, హేమ, నేహాల్, కేదార్, పశుపతి, ప్రశాంత్ ముదిరాజ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్

సీఎంకు పాలనపై దృష్టిలేదు

ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తే ఎందుకు స్పందించరు

పాలమాకుల కస్తూర్బా గాంధీ హాస్టల్ సందర్శనలో

మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి

మేమున్నాం..భయపడొద్దంటూ..

విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా

శంషాబాద్ రూరల్, ఆగస్టు 31: 'ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తే ప్రభుత్వం ఎందుకు స్పందించదు.. సీఎం ఏం చేస్తున్నారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తప్ప.. పాలన మీద దృష్టిలేకపోవడం విడ్డురంగా ఉంది' అని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలంటూ...రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని కస్తూర్బాగాంధీ హాస్టల్ విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం హాస్టల్‌ను మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'హాస్టల్‌లో మా పిల్లలు ఇబ్బందులుపడుతున్నారు. మీరే చూడాల'ంటూ..విద్యార్థుల తల్లిదండ్రులు కోరగా, స్పందించిన హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి.. 'మీకు మేమున్నాం..మీకేం కాదు.. సీఎం రేవంత్‌రెడ్డి పాలన పూర్తిగా గాడితప్పింది. విద్యార్థులకే కాదు.. రాష్ట్ర ప్రజలకు కూడా ఎక్కడ చూసినా అన్యాయమే జరుగుతున్నది' అని అన్నారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. 'మీ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా.. మాకు సమాచారం ఇవ్వాల'ంటూ.. సూచించారు. హాస్టల్‌లో వండుతున్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఆడపిల్లలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికీ చెప్పుకోవాలో తెలియక కిలోమీటర్ దూరం వెళ్లి..రోడ్డెక్కి ధర్నా చేసే పరిస్థితి వచ్చిందంటే లోపం ఎక్కడ ఉన్నదో అర్థమవుతున్నదన్నారు. కులం పేరుతో దూషిస్తున్నట్లు విద్యార్థులు కన్నీరుపెట్టుకోవడం బాధాకరమన్నారు. ఏదైనా అడిగితే కర్రలు విరిగేలా కొడుతున్నారని చెప్పినట్లు పేర్కొన్నారు. ఓ విద్యార్థి టీచర్ కొట్టిన దెబ్బలకు గాయమైన చేతిని చూపుతూ.. ఏడుస్తున్న తీరు కలిచివేసిందన్నారు. 'ఇప్పటివరకు కేవలం ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చారు. మరో జత అడిగితే ఇవ్వడం లేదు. పుస్తకాలు సైతం ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు, కస్తూర్బాగాంధీ హాసళ్ల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది' అని అన్నారు.

కేసీఆర్ పాలనలో సన్నబియ్యంతో అన్నం పెడితే..

గతంలో కేసీఆర్ పాలనలో సన్నబియ్యంతో అన్నం పెడితే .. నేడు గొడ్డుకారం పెడుతున్నారు' అని హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు వివిధ గురుకులాలకు చెందిన 500 మంది దవాఖాన పాలయ్యారు. 38 మంది పిల్లలు చనిపోయారు. పాములు కరిచి చనిపోతున్నారు. ఎలుకలు కొరికి దవాఖానలో చేరుతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థుల పట్ల కించపరిచేలా మాట్లాడటం సరికాదు. పిల్లలు భయపడుతున్నారు. ఇక్కడ ఉన్న టీచర్లను మార్చి కొత్తవారిని తీసుకొచ్చి.. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలి' అని డిమాండ్ చేశారు. మైనార్టీ గురుకులాలకు జనవరి నుంచి మెస్ బిల్లులు ఇవ్వడం లేదు. రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో కాస్మోటిక్ చార్జీలు, కరెంట్ బిల్లులు ఇవ్వలేదు' అని చెప్పారు. ఇప్పటికైనా సీఎం పాలనపై దృష్టి పెట్టి సమీక్షలు చేసి విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్‌ను సందర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు కార్తిక్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ సతీశ్ తదితరులు ఉన్నారు. అలాగే హాస్టల్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మా పిల్లలను వేధించడం తగదు

మా పిల్లలను చదువుకోవడానికి పంపిస్తే వారికి చదువు చెప్పడం మానేసి.. వేధింపులకు గురి చేయడం మంచిదికాదు. దుస్తులు ఇవ్వడంలేదు. మంచి అన్నం పెట్టమంటే కులం పేరు పేరుతో దూషించడం ఏమిటి. గతంలో ఇలాంటి పరిస్థితి లేదు.

-లావణ్య, విద్యార్థిని తల్లి

ఏం జరిగినా..

మా పిల్లలకు ఏం జరిగినా ఉపాధ్యాయులదే బాధ్యత. మేం పేదోళ్లం అందుకే హాస్టల్‌లో వేసినం. మా కులం పేరుతో దూషించడం మంచిది కాదు. చదువుకున్నోళ్లు అనే మాటలేనా.. ఉపాధ్యాయులను పూర్తిగా మార్చివేసి.. మా పిల్లలకు న్యాయం చేయాలి. -కుమార్, విద్యార్థిని తండ్రి

స్టాఫ్‌ను పూర్తిగా మార్చినం

హాస్టల్‌లో విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలంటూ.. ఆందోళనకు దిగిన విషయం తెలుసుకొని వెంటనే డీఈవో శశీధర్‌రావు హాస్టల్‌ను సందర్శించి.. మాకు ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్‌లో స్టాఫ్‌ను పూర్తిగా మార్చినం.

-సుజాత, జీసీడీవో(గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)

సమగ్రాభివృద్ధికి పటిష్ట ప్రణాళిక

బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): నగరాభివృద్ధికి అన్ని శాఖల సమన్వయంతో పటిష్టమైన ప్రణాళికను రూపొందించుకొని ముందుకెళ్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ అనుబంధ శాఖల అధికారులతో సిటీ అభివృద్ధే లక్ష్యంగా 66వ కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న ఎజెండా అంశాల్లో చేపట్టిన పనులు, పూర్తయినవి, ట్రాఫిక్ సమస్యలు, రోడ్ సేఫ్టీ, వాటర్ లాగింగ్ పాయింట్స్, ఇరుకు రోడ్లకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణకు ఆయా రోడ్ల జంక్షన్లలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అదేవిధంగా ప్రస్తుత సమావేశంలో తీసుకున్న కొత్త ప్రతిపాదనలకు ప్రణాళికలు చేశారు. సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యశాఖలైన ఆర్ అండ్ బీ, మెట్రో రైలు, విద్యుత్, జాతీయ రహదారులు, ట్రాఫిక్, వాటర్ వర్క్స్, హెచ్ఎండీఏ, పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగర ఇమేజ్ మరింత పెంచేందుకు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే విధంగా గ్రేటర్‌లో అభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. సమావేశంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బఫర్ జోన్లలో అనుమతుల ఫలితం..

ఆరుగురు అధికారులపై కేసులు



శనివారం ఈదుల కుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

అప్పాచెరువులో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

సిటీబూరో/మైలార్‌దేవ్‌పల్లి : చందానగర్, నిజాంపేట చెరువులకు సంబంధించిన బఫర్ జోన్‌లలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా సైబరాబాద్ పోలీసులకు హైడ్రా సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, చందానగర్ బల్దియా డిప్యూటీ కమిషనర్ సుదామ్ష్, బాచుపల్లి ఎంఆర్‌వో పూల్‌సింగ్, మేడ్చల్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి సుధీర్‌కుమార్, హెచ్ఎండీఏ సిటీ ప్లానర్ రాజ్‌కుమార్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ తెలిపారు.

ఆక్రమణల చెరవీడిన అప్పా చెరువు

గగన్‌పహాడ్‌లోని అప్పా చెరువులో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు శనివారం కూల్చివేశారు. భారీ బందోబస్తు మధ్య చెరువును ఆక్రమించి నిర్మించిన 13 నిర్మాణాలను నేలమట్టం చేశారు. కబ్జాదారులు అడ్డుకునేందుకు ప్రయత్నించిగా, పోలీసులు వారిని నిలువరించి.. కూల్చివేతలను కొనసాగించారు. కాగా, సున్నం చెరువు, ఈదుల కుంటను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఆక్రమణలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పద్మావతి నగర్ బస్తీవాసులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో కమిషనర్ రంగనాథ్ చెరువు పరిశీలనకు రావడంతో బస్తీవాసులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు.

బీజేపీ కార్పొరేటర్ షెడ్డు సైతం..

మైలార్‌దేవ్‌పల్లి బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అప్పాచెరువును ఆక్రమించి భారీ షెడ్డు నిర్మించారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాన్ని చేపట్టినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. ఆ నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. అయితే పట్టా భూముల్లో నిర్మించుకున్న నిర్మాణాలను రాజకీయ కక్షతో కూల్చి వేశారని శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు.సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించి నిర్మాణాలను కూల్చివేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ తాతల కాలం నుంచి వస్తున్న భూముల్లో చేపట్టిన నిర్మాణాలను అక్రమ కట్టడాలని ఎలా నిర్ణయిస్తారని ఆయన మండిపడ్డారు.

విద్యార్థులకు ధైర్యం చెబుతున్న మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, హరీశ్‌రావు

పబ్బులపై దాడులు

ఎక్సైజ్, టీజీ న్యాబ్ జాయింట్ ఆపరేషన్

ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్, రంగారెడ్డి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్, టీజీ న్యాబ్ అధికారులు శుక్రవారం రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు పబ్బులపై దాడులు నిర్వహించారు. జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రముఖ ప్రాంతాల్లో ఏకకాలంలో 25 ప్రత్యేక బృందాలతో నిర్వహించిన సోదాల్లో ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్టు తేలింది. మొత్తం 130 మంది అనుమానితులను డ్రగ్ డిటెక్షన్ కిట్‌లతో పరీక్షించగా ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. జీరో 40 బ్రేవ్స్‌లో ఐటీ ఉద్యోగి, రియల్టర్, విస్కీసాంబా పబ్‌లో డీజే ఎంప్లాయ్, స్టూడెంట్, జరా పబ్‌లో ఓ ఉద్యోగి, క్లబ్ రోగ్ పబ్‌లో విజయవాడకు చెందిన ఓ యువతికి పాజిటివ్ రాగా కేసులు నమోదు చేసి, కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్ కిషన్, అదనపు ఎస్పీ భాస్కర్, డీఎస్పీలు మనోహర్‌రావు, తిరుపతియాదవ్, టీజీ న్యాబ్ సీఐలు రాజశేఖర్, సంతోష్ కుమార్, ఎస్సైలు వెంకట్, వెంకట రమణ పాల్గొన్నారు.

రూల్స్ అతిక్రమిస్తే..అంతే

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు.. తప్పదు మూల్యం

ఇప్పటివరకు 7,565 లైసెన్స్‌లు రద్దు.. గతేడాది 16, 649లు క్యాన్సిల్

నిబంధనల అతిక్రమణలపై రవాణా శాఖ కొరడా

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

'కొందరు డ్రైవర్లు మృత్యుపాశాలుగా మారుతున్నారు. డ్రైవింగ్‌పై నియంత్రణ కోల్పోయి.. ఇతరుల ప్రాణాలను బలితీసుకుంటున్నారు. నగర రహదారులపై స్పీడ్ లిమిట్ నిబంధన ఉన్నప్పటికీ దానిని ఏ మాత్రం పట్టించుకోకుండా దూసుకొస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లపై సైతం వేగంగా వెళ్లడానికి యత్నిస్తున్నారు. ఇలాంటి క్రమశిక్షణారాహిత్య డ్రైవింగ్‌తో చాలా మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల హబ్సిగూడలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లోనూ అతివేగమే కారణంగా నిపుణులు చెబుతున్నారు. కారణమేదైనా నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో మరొకరి ప్రాణం తీసి వారి కుటుంబానికి శోకం మిగిల్చిడం..తీవ్ర నేరంగా అధికారులు భావిస్తున్నారు. కేసు నమోదుతో పాటు డ్రైవర్ల లైసెన్స్‌ల రద్దును పరిశీలిస్తున్నారు.

-సిటీబ్యూరో, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ)

వాహనదారుల నిర్లక్ష్యంపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించే వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, ట్రాఫిక్, రవాణా నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన కేసులు మొదటి కేటగిరీగా, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నవాటిని రెండో కేటగిరీగా వర్గీకరించి కేసులు నమోదు చేస్తున్నారు. వాహనం నంబర్‌పై స్పీడ్ లేజర్ గన్ చిత్రీకరించిన దృశ్యాలను చూస్తూ అధిక సార్లు అతివేగంతో ప్రయాణించడాన్ని ట్రాఫిక్ పోలీసులు గుర్తించి.. లైసెన్స్ సస్పెండ్ చేయాలని రవాణాశాఖకు పంపుతున్నారు. లైసెన్స్ రద్దులో ఉన్నప్పుడు వాహనం నడుపుతూ దొరికితే జైలు శిక్ష కూడా పడే వీలుంది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారుల్లో క్రమశిక్షణ పెంపొందించే అవగాహన కార్యక్రమాలను సైతం ఆర్టీఏ అధికారులు నిర్వహిస్తున్నారు.

లైసెన్స్ రద్దు వివరాలు ఇలా...!

జిల్లా	2023	2024 (ప్రస్తుతం వరకు)
హైదరాబాద్	6158	2833
రంగారెడ్డి	6030	2935
మేడ్చల్	4461	1797

జలమయమైన మణికొండ రోడ్డు

హుస్సేన్‌సాగర్ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

గ్రేటర్‌కు వాయు'గండం'

సిటీబ్యూరో/మణికొండ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో శనివారం తెల్లవారుజాము నుంచి గ్రేటర్ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. హయత్‌నగర్‌లో అత్యధికంగా 3.55 సెం.మీలు, సరూర్‌నగర్‌లో 3.45 సె.మీలు, వనస్థలిపురంలో 3.40 సెం.మీలు, బండ్లగూడ 3.35 సెం.మీలు, ముషీరాబాద్ ఎంసీహెచ్ కాలనీలో 3.33 సెం.మీలు, మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లో 3.15 సెం.మీలు, నాగోల్‌లో 3.13 సెం.మీలు, పాతబస్తీలోని యాకుత్‌పురా, గోల్కొండ, లంగర్‌హౌస్‌లో 3.0 సెం.మీలు, పాతబస్తీలోని చందూలాల్ బారాదరి, బహదూర్‌పురాలో 2.93 సెం.మీలు, రాజేంద్రనగర్‌లో 2.88 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ విజయలక్ష్మి సూచించారు.

జంట జలాశయాలకు వరద

జంట జలాశయాలకు వరద పోటెత్తుతున్నది. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన దరిమిలా.. మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను సూచించారు. క్షేత్రస్థాయిలో అత్యవసర బృందాలు, ఎస్పీటీ వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు.

సోమవారం పాఠశాలలకు సెలవు

రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలంటూ అధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ముందస్తుగా సోమవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ తెలిపారు.